క్లుప్తంగా

బుడార్సింగి వరకు బస్సులు నడపాలని వినతి



ప్రభుత్వ విప్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంస్థ సభ్యులు

సోంపేట: సోంపేట నుంచి మందస మండలం బుడార్సింగి వరకు పల్లెవెలుగు బస్సులు నడపాలని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కవిటిలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. సోంపేట నుంచి బుడార్సింగి వరకు బస్సులు లేక పోవడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యను గుర్తించి బస్సులు నడపాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి తదితరులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

టెక్కలి: విశ్వకవి యోగి వేమన జయంతి సందర్భంగా నిరుపేదకు నేనున్నాను చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు ఏదూరు శ్రీనివాసరెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, ఆర్.ఆర్.రాజు, సీహెచ్ రాజశేఖర్, ఉమామహేశ్వరరావు, దినేష్, డి.శంకర్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామానికి చెందిన వెంకటరావు రౌతో భార్య విష్ణమ్మ కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందింది. ఈ కుటుంబం ఆర్థికంగా బాధపడుతున్నట్టు తెలుసుకున్న కొఠారీకి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ సభ్యులు స్పందించారు. రూ.16 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతిని కుటుంబానికి సంఘ సభ్యులు ఆదివారం అందజేశారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

కాశీబుగ్గ: మందస మండలం పరిధిలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. పాడి రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు వ్యాధినిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందజేస్తామన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో సోమవారం నుంచి పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు పశువైద్యాధికారి మెట్ట పాపారావు తెలిపారు. 20న ఉంగ్రికుడియా, 21న మోట్టూరు, 22న పల్లిసారధి, 23న బెండి, 24న బాతుపురం, 25న గుళ్లలపాడు, 27న గరుడబద్ర, 28న రాజాం, 29న పెద్దబొడ్డపాడు, 30న సీతాపురం, 31న పెదబాడాం గ్రామాల్లో శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

బోరుబావికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎంపీపీ పద్మ తదితరులు

కవిటి: సహలాలపుట్టుగ పంచాయతీ పరిగివీధిలో బోరుబావి నిర్మాణానికి ఎంపీపీ కడియాల పద్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థికసంఘం నిధులు రూ. 1.50 లక్షల వ్యయంతో విద్యుత్ మోటారుతో నడిచే బోరుబావి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కడియాల ప్రకాష్, గస్యా రవి, భగవాన్‌ప్రదాన్ పాల్గొన్నారు.

పది మందిపై కేసు నమోదు

నందిగాం: నందిగాం మండల కేంద్రానికి చెందిన ఇరువర్గాలవారు వేర్వేరుగా చేసిన ఫిర్యాదుల మేరకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ డిల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. స్థానిక ఎస్సీ వీధికి చెందిన గొండు మదన్‌మోహన్ మురళీకుమార్ తప్పుడు ప్రచారం చేశాననే ఉద్దేశంతో దారి కాచి దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్యాడ జయరాంతో పాటు మరో ఆరుగురిపై, అలాగే జడ్యాడ వెంకటరావు కారుతో వెనుకనుంచి ఢీకొట్టి అడిగితే దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొండు మదన్‌మోహన్ మురళీకుమార్‌తో పాటు మరో ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెప్పుకోలేని వ్యథ!

- మరుగుదొడ్లు లేని మెప్మా కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాల సభ్యులు



పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మెప్మా కార్యాలయం



కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మెప్మా కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. దీంతో ఇక్కడ రోజూ జరిగే మహిళా, స్వయంశక్తి సంఘాల సమావేశాలకు హాజరయ్యే సభ్యులు అత్యవసర పరిస్థితిలో చెప్పుకోలేని వ్యధను అనుభవిస్తున్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల పరిధిలోని 12 వందల మహిళా సంఘాలతోపాటు 13 వేల మంది స్వయంశక్తి సంఘాల సభ్యులు ఉన్నారు. అలాగే 55 మంది ఆర్పీలు, సీఎల్ఎల్ఎఫ్ఆర్పీలు, కార్యాలయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోజూ కనీసం ఐదు నుంచి పది గ్రూపుల సభ్యులు వివిధ పనులపై ఈ కార్యాలయానికి వస్తుంటారు. ఒక్కోసారి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, జిల్లా అధికారులు సైతం సమావేశాలు ఇక్కడే నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ పరిస్థితి మాత్రం ఘోరంగా ఉంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో ఉన్న ఇ భవన సముదాయంలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి 2007 జనవరి ఏడో తేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. అనీస మౌలిక వసతులు సమకూర్చాలని అప్పటి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అయితే కాంట్రాక్టర్ మాత్రం మరుగుదొడ్లను నిర్మించలేదు.

అప్పటి నుంచి అనేక ప్రభుత్వాలు మారాయి. అలాగే నాలుగుసార్లు మున్సిపల్ పాలకవర్గం మారినప్పటికీ ఎంతో ప్రాధాన్యత ఉన్న కార్యాలయం వద్ద మరుగుదొడ్ల సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ఇక్కడకు సమావేశాలకు వచ్చే మహిళలు అత్యవసర సమయంలో చెప్పుకోలేని వ్యధను ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరుగు, మూత్రశాలలను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలి



మెప్మా కార్యాలయం వద్ద మౌలిక సదుపాయాలు లేకపోవడం బాధాకరం. సమావేశాలకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా మరుగుదొడ్లను నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– దున్న నిర్మల, కౌన్సిలర్, ఒకటోవార్డు, మొగిలిపాడు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

తక్షణ చర్యలు చేపట్టాలి



మహిళలు తమ సమస్యను బయటకు చెప్పుకోవడానికి ఇబ్బందులు పడతారు. మున్సిపల్ మెప్మా కార్యాలయం వద్ద పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. తక్షణమే మరుగుదొడ్లు నిర్మిస్తే ఎంతో ఉపయోగపడుతుంది. పారసాంబ, పెసరపాడు వంటి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే సభ్యులకు తప్పనిసరిగా వాష్‌రూపం ఉండాలి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతన్నాను.

– బదకల బాలమ్మ, మాజీ కౌన్సిలర్, మూడోవార్డు, పద్మనాభపురం

త్వరలో నిర్మిస్తాం



మున్సిపల్ మెప్మా కార్యాలయం వద్ద మహిళలు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. 2007 నుంచి సమస్య ఉంది. అనేక మంది మహిళలు సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారు. విషయాన్ని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం. కౌన్సిల్ సభ్యులు ఆమోదం సైతం తెలిపారు. కొద్ది రోజులలో మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

అలరించిన త్యాగరాజ కీర్తనలు



సామూహిక గళార్చనలో ఉద్దానం కళాకారులు

కవిటి: త్యాగరాజస్వామి మనకు అందించిన కృతులు, కీర్తనలు దేశ సంపదలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. గొండ్యాల పుట్టుగలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు, బీజేఎస్ సంగీత పాఠశాల ఐదో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి ఉద్దానం ప్రాంతానికి చెందిన సీనియర్ సంగీత, వర్ధమాన కళాకారులు అంతా కలిసి సామూహిక పంచరత్నకీర్తన సేవ నిర్వహించారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిరంతరాయంగా పాడిన త్యాగరాజ కీర్తనలు ఆహూతులను అలరించాయి. అలాగే స్థానిక సంగీత పాఠశాలలో శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకుంటున్న కళాకారులు, బాలబాలికలతో నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు సంగీత, నాట్యప్రియులకు ఆనందాన్ని పంచాయి. కార్యక్రమంలో పండి దేవేంద్రమూర్తి, బి.రమేష్, పొందూరు బాలకృష్ణ, ధర్మారావు, బీజేఎస్ సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ రెల్ల జోగారావు, పిరియా నరసింగరావు పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి



సన్మాన గ్రహీతలతో కుల పెద్దలు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

పలాస: ప్రతిఒక్కరు తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని మందస ఎంపీపీ డొక్కర దానయ్య అన్నారు. మందస మండలం పెద్ద లింబుగాంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు డొక్కర ధనుంజయ మాస్టార్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. యాదవ సామాజిక వర్గానికి చెంది ఎంబీబీఎస్, ఐఐటీ, ఏఐటీతో పాటు గ్రూప్ వన్, గ్రూప్ టులకు ఎంపికైన విద్యార్థులు, ఎంబీబీఎస్ పూర్తి చేసిన నర్తు హరిక్రిష్ణ, నర్తు మధులత, మద్దిల ప్రియాంక, కడమటి లోకేష్, పిలక దివ్యాంజలి, కర్రి రాజేష్‌లకు సత్కరించారు. అలాగే ఐఐటీ విద్యార్థులు బంగారు రాజగిరి, కడియాల నిఖిల్, కొల్లి రాహుల్, బందాపు శ్రీనిధి, ఇండియన్ నేవీకి ఎంపికైన మండల రేష్మ, మండల సుష్మలతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సంఘం తరపున సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దానయ్య మాట్లాడుతూ.. సమాజంలో సరైన గౌరవం దొరకాలంటే ప్రతిఒక్కరు ఉన్నత చదువులు చదివి వారి తల్లిదండ్రులకు, యాదవ సమాజానికి తగిన గౌరవం లభించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అందాల శేషగిరిరావు, మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, ఎంపీటీసీ సభ్యుడు కె.వల్లభరావు, సర్పంచ్ కె.వాసు, ఎంప్లాయిస్ గ్రూపు కోశాధికారి కొర్రాయి రామారావు, పి.రమణ, డొక్కర జనార్దన పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్టు సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న రత్నాకర్

పలాస: పలాస మండలం రామక్రిష్టాపురం శ్రీసత్యసాయి విద్యావిహార్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె రత్నాకర్ అన్నారు. విద్యావిహార్‌ను ఆదివారం సందర్శించారు. నూతన భవన సముదాయం పైఅంతస్తును పరిశీలించారు. ట్రస్టు సభ్యులతో ఆయన మాట్లాడుతూ..ఈ నెల 31వ తేదీన పైఅంతస్తు భవనాలను ప్రారంభించడానికి వస్తానన్నారు. విద్యా సంస్థ ద్వారా విద్యార్థులకు, సమాజానికి మంచి సేవలు అందించాలని కోరారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాళాసు శ్రీను, కార్యదర్శి మల్లా శరత్, బ్యాంకర్స్ కాలనీ కన్వీనరు అల్లాడ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం



కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో చెత్తను ఏరుతున్న పోలీసులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కాశీబుగ్గ పట్టణ సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ చంద్రరావు ఆధ్వర్యంలో స్టేషన్ పరిసరాలలో చెత్తను తొలగించి శుభ్రం చేసుకున్నారు. ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, హెచ్‌జీలు పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బంది కలిసి శ్రమదానం చేశారు. ఎస్ఐ పి.పారినాయుడు పర్యవేక్షించారు.

శ్మశానవాటికలో..

వజ్రపుకొత్తూరు: పూండి–గోవిందపురం శ్మశాన వాటికలో శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. జేసీబీతో తుప్పలు, చెట్లను తొలగించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రి కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ పాల్గొన్నారు.



కంచిలి పోలీస్ స్టేషన్‌లో శ్రమదానం చేస్తున్న సిబ్బంది



వజ్రపుకొత్తూరు: శ్మశాన వాటికలో తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

కవిటి ఎంఈవో–2 గా సురేష్‌కుమార్



కవిటి: మండల విద్యాశాఖాధికారి–2గా కవిటి మండలం కుసుంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రేడ్–2 హెచ్‌ఎం డి.సురేష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ (విశాఖ)కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని ఎంఈవో–1 ధనంజయమజ్జి ఆదివారం తెలిపారు. ఇప్పటి వరకు ఎంఈవో–2గా వ్యవహరిస్తున్న కె.చిట్టిబాబు ఇన్‌చార్జి ఆదేశాలను రద్దుచేస్తూ తాజాగా ఉత్తర్వులు వచ్చినట్టు పేర్కొన్నారు.

తీరం కళకళ



తీరంలో పర్యాటకులు

సోంపేట: బారువ తీరం పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాలకు వచ్చిన బంధువులు, స్నేహితులతో కలిసి సముద్ర తీరానికి రావడంతో కళకళలాడింది. సముద్రంలో స్నానాలు ఆచరించి ఉల్లాసంగా గడిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారువ మెరైన్ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

23న ఆర్ట్ ఎగ్జిబిషన్

కాశీబుగ్గ: సుభాష్‌చంద్రబోస్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 23వ తేదీన పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు ప్రముఖ చిత్రకారుడు రెయ్యి తాతారావు ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న చిత్రకారులు ఎగ్జిబిషన్‌లో పాల్గనవచ్చునని అన్నారు. ఆసక్తి ఉన్నవారు 94909 15521 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నాయకుల పరామర్శ

కవిటి: సిలగాం గ్రామానికి చెందిన సిహెచ్ సింహాద్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం సింహాద్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కంచిలి: జాడుపూడి పంచాయతీ పరిధి గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన కొర్రాయి రామజోగులు అనారోగ్యం కారణంగా మృతిచెందారు. మృతుని కుటుంబీకులను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు లడ్డు కేశవపాత్రో, గ్రామస్తులు కొర్రాయి ఢిల్లీరావు, మురపాల నారాయణ, బంగారు క్రిష్ణారావు, బంగారు తులసయ్య, మురపాల లక్ష్మీనారాయణ ఉన్నారు.

మత్తుకు చిత్తుకావద్దు

టెక్కలి రూరల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని తిర్లంగి గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎవరూ మత్తుకు అలవాటుపడి జీవితాలను చిత్తు చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాపకాల దొంతరలో..

చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకుంటూ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దీనికి అక్షరాలు నేర్చుకున్న సరస్వతీ నిలయాలే వేదికగా మారాయి. వివిధ పాఠశాలల్లో కలిసి చదువుకున్న వారంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకొని మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యుల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు.



కాశీబుగ్గ: 25 ఏళ్ల తరువాత కలుసుకున్న పలాస పాఠశాల పూర్వ విద్యార్థులు



వజ్రపుకొత్తూరు రూరల్: ఒకే వేదికపై అక్కుపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు



కవిటి: రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆత్మీయ కలయిక దృశ్యం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. కొంచాడ ధనుంజయ, తంగుడు గోపాల్, బద్రి సోమేష్, కృష్ణచంద్ర పాత్రో, బైరిశెట్టి శ్రీనివాసరావు, గుడ్ల చైతన్య, సుజల, సౌజన్య, డొక్కరి శంకర్, పూర్ణిమ, జలజాక్షి, నీలాచలం పట్నాయక్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అక్కుపల్లి శివసాగర్ తీరంలో కలుసుకున్నారు. సహాపంక్తి భోజనాలు చేసి ఆట పాటలతో సందడి చేసారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

కవిటి: రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1996–2001 బ్యాచ్, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–98 బ్యాచ్, బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983–88 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేసుకొని కలుసుకున్నారు. చదువులు చెప్పి ప్రయోజకుల్ని చేసిన గురువులందర్నీ మేళతాళాలతో స్వాగతం పలికి పాదపూజ చేసి దక్షిణ తాంబూళాలతో సత్కరించి జ్ఞాపికల్ని అందించారు.

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09, 2010–11 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని సందడి చేశారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. రోజంతా కబుర్లు చెప్పుకొని గడిపారు.



కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



కవిటి: బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కంచిలి: జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో 2010-11 టెన్త్ విద్యార్థులు



కంచిలి: ఒకే వేదికపై 2008-09 పూర్వ విద్యార్థులు

పోటెత్తిన ప్రయాణికులు



రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు

కంచిలి: సంక్రాంతి పండుగ కోసం వివిధ ప్రాంతాలన నుంచి స్వగ్రామాలకు వచ్చినవారంతా తిరిగి వెళ్లిపోతున్నారు. హైదరాబాద్, ముంబాయి, అహ్మదాబాద్, భువనేశ్వర్ వంటి దూరప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరిగి వెళ్లేందుకు ఆదివారం సోంపేట రైల్వేస్టేషన్‌కు రావడంతో రద్దీగా మారింది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, చెన్నై మెయిల్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ తదితర ఎక్స్‌ప్రెస్‌లకు, అలాగే నార్త్‌వైపు ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్ల కోసం ప్రయాణికులు వేచి ఉండడం కనిపించింది.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



సమావేశంలో ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు

కాశీబుగ్గ: వచ్చే నెల ఏడో తేదీన నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజ కోరారు. ఈ మేరకు పురుషోత్తపురం గ్రామంలో ఆదివారం సమావేశం ఆదివారం నిర్వహించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లక్ష డప్పులు–గుండె చప్పుడు చేస్తామన్నారు. ఎస్సీ ఉపకులాలవారు తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పట్ట తవిటయ్య, పత్తిరి బాబ్జీ, ఉన్నాన అప్పలరాజు, రాణా శ్రీనివాసరావు ఉన్నారు.

బాలకృష్ణారావుకు సన్మానం



బాలకృష్ణారావును సత్కరిస్తున్న తిలక్ తదితరులు

నందిగాం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన కురమాన బాలకృష్ణారావును ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ బాలకృష్ణారావుకు శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. కష్టకాలంలో పార్టీకి ప్రతిఒక్కరూ అండగా నిలుస్తూ, ప్రజల పక్షాల పోరాటాలకు వెనుకాడకూడదని సూచించారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియామకం చేసుకొని ఏకపక్షంగా పాలన సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలో పలువురు చిన్ని స్థాయి ఉద్యోగులను కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా తొలగించారని , వారి పక్షాన న్యాయం కోసం పోరాడతానన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని భరోశా ఇచ్చారు. అనంతరం బాలకృష్ణారావు మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే పదవి అప్పగించి మరింత బాధ్యత పెంచారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు, పేరాడ తిలక్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, పోలాకి మోహనరావు, బాలక మధు, అక్కురాడ లోకనాథం, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, పిన్నింటి జయరాం,తమిరె దేవేంద్ర, సర్లాన బైరాగి, బొమ్మాళి గున్నయ్య, బొంగి హనుమంతురావు, రోణంకి డిల్లేశ్వరరావు, కంచరాన శ్రీధర్ పాల్గొన్నారు.

